సాక్షి అనంతపురం


సోమవారం, 24, జూన్, 2024



భక్తిభావం.. సంగీతోత్సవం

అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో ఆదివారం సంగీతోత్సవం వీనులవిందుగా సాగింది.

8లో



లోకాలు ఏలేవాడు.. కొండపై

బుక్కరాయసముద్రం సమీపంలో కొండపై వెలసిన శ్రీ మన్నారాయణుడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు.

8లో

గరిష్టం/కనిష్టం

35.6°/23.9°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

సాగుకు సాయమేదీ?

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం తన వాటాగా ఇచ్చే రూ.2 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చాలామంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యింది. అయితే, అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేల చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేస్తానని చెప్పిన ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇంకా ఆ విషయంపై దృష్టి సారించలేదు. దీంతో రైతులు రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందా.. అని ఎదురుచూస్తున్నారు.

- రైతులకు పెట్టుబడి సాయంపై దృష్టి సారించని ప్రభుత్వం
- బీమా పరిహారంపైనా నోరు మెదపని వైనం
- ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా రైతులకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇంకా 'భరోసా' లభించలేదు. పంటల బీమాపై ధీమా కల్పించలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రైతులు ఖరీఫ్ పంటల సాగు కొనసాగిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం, బీమా పరిహారం అందించాల్సిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇంకా దృష్టి సారించకపోవడం గమనార్హం. పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈనెల 18న తన వాటా రూ.2 వేల ప్రకారం రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వాటాపై ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.

జగన్ ప్రభుత్వంలో జూన్‌లోనే 'భరోసా'

గతేడాది జూన్ ఒకటో తేదీన వరుసగా ఐదో ఏడాది మొదటి విడత కింద రూ.7,500 ప్రకారం రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులు జిల్లాలో 2.89 లక్షల మందికి మొత్తం రూ.217 కోట్లు అందజేశారు. అలాగే ఉచిత పంటల బీమా కింద 2022 ఖరీఫ్‌కు సంబంధించి 2023 జూన్ 29న జిల్లా రైతులకు రూ.213 కోట్ల పరిహారం అందించారు. ఈ రెండు పథకాల కింద గత ఏడాది జూన్ నెలలోనే అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఏకంగా రూ.430 కోట్లు ఆర్థిక సాయం అందించింది. చేతుల్లోకి డబ్బు చేరడంతో ఖరీఫ్ సాగుకు ఢోకా లేకుండా రైతులు ముందుకు సాగారు. వైఎస్ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో ఉచిత పంటల బీమా కింద 6.46 లక్షల మంది జిల్లా రైతులకు రూ.1,160 కోట్ల పరిహారం అందించింది. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో కూడా 7.74 లక్షల మంది రైతులకు రూ.723 కోట్ల బీమా ఇచ్చారు. జిల్లాలో రైతు భరోసా–పీఎం కిసాన్ కింద కూడా 14.34 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.1,937 కోట్ల మేర పెట్టుబడి సాయం జమ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 13.53 లక్షల మంది రైతులకు రూ.1,827 కోట్లు అందించారు. ఈ రెండు పథకాల కింద అనంతపురం జిల్లా రైతులకు రూ.3,097 కోట్లు, 'శ్రీ సత్యసాయి' రైతులకు రూ.2,550 కోట్లు వెరసి ఉమ్మడి జిల్లా రైతులకు గత ఐదేళ్లలో రూ.5,647 కోట్లు జమ చేశారు.

బాబు 'భరోసా' ఎప్పుడో.?

సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఇప్పటి వరకు రైతు సంక్షేమంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రూ.20 వేలు ఎలా ఇస్తారు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా అందిస్తున్న రూ.6 వేలతో కలిపి రూ.20 వేలు ఇస్తారా? లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తం అందిస్తుందా, విడతకు ఎంత ఇస్తారు... కౌలురైతులు, అటవీ, దేవాదాయ భూమి సాగుదారులకు పూర్తి స్థాయి మొత్తం ఇస్తారా అనే దానిపై ఇంకా ప్రకటన రాలేదు. గత జగన్ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ప్రీమియం చెల్లించి ఉద్యాన, వ్యవసాయ పంటలకు ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేసింది. గత ఐదేళ్లలో పెద్ద మొత్తంలో పరిహారం అందించింది. దీనికి సంబంధించి జూన్‌లోనే కొత్తగా పంటల బీమా నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. గతంలో ఈ–క్రాప్ ఆధారంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ బీమా అందేలా పథకం అత్యంత పారదర్శకంగా అమలు చేశారు. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం వెంటనే భరోసా, బీమా పథకాల కింద సాయం అందించాలని జిల్లా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి మృతి



మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డి(ఫైల్)

ముదిగుబ్బ: పూర్వపు నల్లమాడ నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు వెంకటరెడ్డి (80) అనారోగ్యంతో ఆదివారం మరణించారు. ఈయన 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కదిరి, నల్లమాడ ప్రాంత వాసులకు ఈయన సుపరిచితులు. ప్రజాప్రతినిధిగా అన్ని వర్గాల వారికీ ఎనలేని సేవలందించారు. ఎమ్మెల్యేగా ఉన్నా సాధారణ జీవితం గడిపారని.. ఎక్కడికైనా బస్సులోనే మామూలు వ్యక్తిగా ప్రయాణించేవారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వెంకటరెడ్డి అంత్యక్రియలు సోమవారం ఉదయం 11 గంటలకు స్వగ్రామం మలకవేమలలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారానికి 655 క్యూసెక్కులకు పడిపోయింది. నీటిమట్టం 5.462 టీఎంసీలకు చేరుకుంది. ఈ నెల 10న ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులకు పైగా ఉండేది. దీంతో డ్యాంలో 6 టీఎంసీలకు పైగా నీరు నిల్వ అయ్యాయి. అయితే, రాయచూర్‌కు సంబంధించిన లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ (ఎల్‌బీఎంసీ)కు, రాయబసవన కాలువకు, జిందాల్‌కు కలిసి 1,957 క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో నీటి మట్టం తగ్గిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 4.182 టీఎంసీల నీరు నిల్వ ఉండింది.

74 వేల క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీలో భాగంగా ఆదివారం నాటికి 82 వేల మంది రైతులకు 74 వేల క్వింటాళ్ల పంపిణీ పూర్తయినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 74,300 క్వింటాళ్ల విత్తనం కోసం 84,200 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నట్లు వివరించారు. జిల్లాకు కేటాయించిన 76 వేల క్వింటాళ్ల పంపిణీ పూర్తి చేసి, నెలాఖరుకు వేరుశనగ పంపిణీ ప్రక్రియ ముగిస్తామన్నారు. ఇక 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు, 50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు, 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసర విత్తన పంపిణీ కొనసాగుతోందన్నారు. సాధ్యమైనంత తొందరగా రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రిప్, పీవీసీ పైపుల ధ్వంసం



ధ్వంసమైన పీవీసీ పైపులు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బిట్రగుంటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పొలాల్లోని డ్రిప్, పీవీసీ పైపులను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇందులో భాస్కర్‌రెడ్డికి సంబంధించి 20, ఆదినారాయణకు సంబంధించి 15 పీవీసీ పైపులు, డ్రిప్ పరికరాలు ఉన్నాయి. వీటి విలువ రూ.20 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీకి చెందిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు.

మహిళ ఇంటిపైకి రాళ్లు

పెనుకొండ రూరల్: పెనుకొండకు ఆదివారం విచ్చేసిన బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితకు స్వాగతం పలికేందుకు వచ్చిన టీడీపీ కార్యకర్తల్లో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపాన వైఎస్సార్‌సీపీ నాయకురాలు సుశీలమ్మ ఇంటికి అతికించిన మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను తొలగించాలని టీడీపీ కార్యకర్తలు హుకుం జారీ చేశారు. తొలగించడానికి ఆమె ససేమిరా అనడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. అంతటితో ఆగక ఇంటిపైకి రాళ్లు విసిరారు. అనంతరం ఇంటికి అతికించిన స్టిక్కర్లను బలవంతంగా తొలగించారు. టీడీపీ కార్యకర్తల దౌర్జన్యంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపారు.

ట్రైనీ కలెక్టర్ల క్షేత్ర స్థాయి సందర్శన



ఆత్మకూరు వద్ద కాయగూరల పంట వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్లు



జీడిపల్లి రిజర్వాయర్ వివరాలను ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్‌ఈ దేశేనాయక్

ఆత్మకూరు/బెళుగుప్ప: మండలంలోని ఆత్మకూరు, పంపనూరు సమీపంలోని పంట పొలాలతో పాటు బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్, పరివాహక ప్రాంతంలోని పండ్ల తోటలను ఆదివారం ట్రైనీ కలెక్టర్లు సందర్శించారు. ఉపాధి హామీ కింద సాగు చేసిన పలు పంటలను పరిశీలించారు. డ్రిప్ పరికరాల గురించి తెలుసుకున్నారు. పంటకు ఎంత మేర దిగుబడి వస్తుంది, పంట ఎన్ని రోజులకు చేతికి వస్తుంది, పెట్టుబడి పోయి లాభం ఎంత మేర రావచ్చు అనే విషయాలపై ఆరా తీశారు. జీడిపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో, తూము, మరువల ద్వారా నీటి విడుదల వివరాలను హంద్రీనీవా ఎస్‌ఈ దేశేనాయక్ ట్రైనీ కలెక్టర్లకు వివరించారు. పలువురు రైతులు మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు సీహెచ్ కల్యాణి, డి. హిమవంశీ, జగన్నాథ్, వినూత్న, హెచ్‌ఎస్ భావన, శుభమ్ నోక్వాల్, హార్టికల్చర్ డీడీహెచ్ ఫిరోజ్‌ఖాన్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, హంద్రీనీవా డీఈలు శ్రీనివాస్, గుప్తా, కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మిత, బెళుగుప్ప మండల తహసీల్దార్ హరినాథ్‌రావ్, ఎంపీడీఓ సుబ్బరాజు, ఆర్ఐ నాగేష్, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.





నృత్య రూపకంలోని ఘట్టాలు

సాయి బోధనలే నేటి సమాజానికి 'కనువిప్పు'

ప్రశాంతి నిలయం: సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నేటి సమాజం సత్యసాయి బోధనలతో కనువిప్పు పొందాలన్న సందేశాన్నిస్తూ చిన్నారులు నిర్వహించిన నృత్యరూపకం భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన ప్రకాశం జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి రచించిన చిన్నకథల ఆధారంగా 'కనువిప్పు' పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. మానవాళి సన్మార్గంలో పయనిచేందుకు ఇచ్చిన మార్గదర్శకాల ఆధారంగా నృత్యరూపకం సాగింది.

మైనర్ చేతికి వాహనమిస్తే జైలుకే..

- ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేసిన ప్రభుత్వం
- అమలులోకి నూతన ట్రాఫిక్ నిబంధనలు
- మద్యం మత్తులో వాహనం నడిపితే మూడేళ్ల జైలు
- అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోతే రూ.10 వేలు ఫైన్



ట్రిబుల్ రైడింగ్‌తో వెళుతున్న మైనర్

తాడిపత్రి రూరల్: జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచే నూతన నిబంధనలు అమల్లోకి వచ్చినా... నూతన ప్రభుత్వం ఏర్పాటుతో అమలులో జాప్యం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నిబంధనలు పాటించని వాహనదారులపై నూతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని తాజాగా సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

చట్టం సవరిస్తూ ఉత్తర్వుల జారీ..

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల్లోని పలు సెక్షన్‌లను కఠినంగా అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులతో పాటు పోలీసులూ సిద్ధమయ్యారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించేలా జీఓ -21 మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల మేరకు గరిష్టంగా పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశముంది. ఇది వాహనదారుల్లో తప్పక మార్పు తెస్తుందని రవాణా శాఖ అధికారులు, పోలీసులు భావిస్తున్నారు. గత చట్టంలో కంటే నూతన చట్టంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. గతంలో జరిమానాలతో సరిపెట్టేవారు. ఇప్పుడు అదనంగా జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పు చేశారు.

తప్పిదానికి తల్లిదండ్రులకు జైలు శిక్ష..

నూతన చట్టం ప్రకారం మైనర్లతో వాహనాలను నడిపిస్తే తల్లిదండ్రులు లేదా సంరక్షకులుగా ఎవరి పేరు ఉంటే వారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తారు. గతంలో కేవలం రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ప్రతి శుక్రవారం జువైనల్ కోర్టుకు హాజరయ్యేలా నిబంధన ఉండేది. అయితే జరిమానా ఒక్కటే కావడంతో నిర్లక్ష్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చి పరోక్షంగా అమాయకుల ప్రాణాలతో పాటు మైనర్ల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లేందుకు కారకులవుతూ వచ్చారు. దీంతో జరిమానాలతో మైనర్లను నియంత్రించలేమన్న ఆలోచనతో నూతన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. భారీగా జరిమానాతోపాటు జైలు శిక్షను కొత్త చట్టంలో చేర్చారు. ఈ క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేసేలా నిబంధన జోడించారు. ఈ చట్టం వల్ల మైనర్ల ర్యాష్ డ్రైవింగ్, సైలెన్సర్ లేకుండా వాహనాలను నడపడం వంటి ఘటనలు నియంత్రించవచ్చునని రవాణా శాఖ అధికారులు, పోలీసులు అంటున్నారు.

నూతన చట్టంలోని ప్రధాన అంశాలు..

- ఈ నెల 1 నుంచి దేశ వ్యాప్తంగా నూతన వాహన చట్టం అమలులోకి వచ్చింది.
- మద్యం తాగి వాహనాలు నడిపితే మొదటి తప్పుగా రూ.10 వేల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండో సారి పట్టుబడితే రూ.15వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు.
- హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కొత్త చట్టం ప్రకారం రూ.వెయ్యి జరిమానా.
- ర్యాష్ డ్రైవింగ్ చేసినా రూ.10 వేల జరిమానా చెల్లించక తప్పదు.
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే రూ.5వేల జరిమానా.
- ఇన్సూరెన్స్ లేని వాహనాలు పట్టుబడితే మొదటి తప్పిదానికి మూడు నెలల జైలు శిక్ష, రూ.2వేలు, రెండో సారి పట్టుబడితే జైలుశిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా.
- పర్మిట్ లేని వాహనదారులకు రూ.10 వేల జరిమానా, ఓవర్‌లోడ్ వేసుకుని వెళితే రూ.20వేల జరిమానా విధిస్తారు.
- వాహన రేసింగ్‌లకు పాల్పడితే మొదటి సారి రూ.5వేల జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తారు.
- అంబులెన్స్‌లకు దారి ఇవ్వకుంటే రూ.10 వేల జరిమానా చెల్లించుకోక తప్పదు.
- నిర్దేశించిన దాని కంటే ఎక్కువ వేగంగా వాహనాన్ని నడిపితే రూ.వెయ్యి జరిమానా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా, వాహనాలను తనిఖీ చేయడానికి నిరాకరిస్తే రూ.750 జరిమానా విధిస్తారు.
- అనవసరంగా హారన్ మోగిస్తే మొదటి తప్పిదానికి రూ.వెయ్యి, రెండో సారి అదే తప్పిదం చేస్తే రూ.2 వేలు చెల్లించుకోక తప్పదు.
- నిబంధనలకు విరుద్ధంగా హారన్లను తయారు చేసిన కంపెనీలు, విక్రయించిన డీలర్లకు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- మైనర్లు వాహనం నడిపి కోర్టుల్లో నిరూపితమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడిని దోషిగా పరిగణిస్తూ రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ సైతం రద్దు చేస్తారు.

డయేరియాతో జాగ్రత్త





జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గుత్తి మండలం రజాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని హర్షిత, రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- చాపకింద నీరులా విస్తరిస్తోన్న అతిసార వ్యాధి
- నెల వ్యవధిలోనే జీజీహెచ్‌లో 200కు పైగా కేసులు
- వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయరాదని వైద్యుల సూచన

అనంతపురం మెడికల్/రాయదుర్గం టౌన్: జిల్లాలో డయేరియా (అతిసార వ్యాధి) ప్రబలుతోంది. నెల రోజుల వ్యవధిలోనే సర్వజనాస్పత్రిలో 200కుపైగా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చిన్నపిల్లల వార్డులో 16 మంది చిన్నారులు డయేరియాకు చికిత్స పొందుతున్నారు. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో వారం నుంచి రోజూ 10 మంది దాకా అతిసార వ్యాధిగ్రస్తులు చేరుతున్నారు. మరో 50 మంది ఓపీ ద్వారా చికిత్సలు పొందుతున్నారు. పలువురు ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా కంబదూరు, బ్రహ్మసముద్రం, రాప్తాడు, అనంతపురం అర్బన్, గుత్తి తదితర ప్రాంతాల్లో డయేరియా తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

శుభ్రత లేకపోవడంతోనే..

నీరు, ఆహారం కలుషితం కావడం, ఫుడ్ పాయిజన్ తదితర కారణాలతో అతిసార వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు తమ చేతులు శుభ్రంగా కడిగేలా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచిస్తున్నారు. బయటి ఆహారం అతిగా తీసుకోకూడదంటున్నారు. సురక్షిత ప్రమాణాలు పాటించని పక్షంలో వ్యాధి సోకే అవకాశం ఉంటుందంటున్నారు.

లక్షణాలు ఇలా..

అతిసార వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. రెండేళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులు ఎక్కువగా వ్యాధి బారిన పడే అవకాశముంటుంది. వాంతులు, విరేచనాలు, జ్వరం అతిసార వ్యాధి లక్షణాలు. విరేచనాల్లో రక్తం వస్తే ప్రాణాపాయంగా పరిగణించాలి.

ముందస్తు చర్యలేవీ?

జిల్లాలో చాపకింద నీరులా అతిసార వ్యాధి వ్యాప్తి చెందుతున్నా ఆరోగ్యశాఖ స్పందించడం లేదు. కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగి డయేరియాను అదుపు చేయాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం చేయొద్దు



వాంతులు, విరేచనాలు అవుతూ ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారి పరిస్థితికి అనుగుణంగా అడ్మిషన్‌లో ఉంచి మూడు నుంచి ఐదు రోజుల పాటు చికిత్స అందిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుంది.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

అవగాహన కల్పిస్తాం



జూలై, ఆగస్టు నెలల్లో డయేరియాపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తాం. ఈ రెండు నెలల పాటు ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యక్రమాలు చేపట్టబోతున్నాం. పీహెచ్‌సీల్లో స్పెషల్ డ్రైవ్‌లు చేపడతాం. వ్యాధి గురించి ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదు.

– డాక్టర్ ఈ.భ్రమరాంబ దేవి, డీఎంహెచ్‌ఓ

ఖాద్రీశా.. నమో నమః

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి, అన్నదానం చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

విద్యారంగాన్ని కాపాడుకుందాం: యూటీఎఫ్


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటాలకు సిద్ధం కావాలని ఉపాధ్యాయులకు యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని శారదా బాలికల నగర పాలకోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1998, 2008 ఎంటీఎస్ టీచర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన యాప్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ... బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులపై పెట్టిన కేసులన్నిటినీ ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యాబోధన మాతృభాషలోనే జరగాలని, సెకండరీ స్థాయి నుంచి సమాంతర మీడియంను కొనసాగించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, పీఎఫ్ ప్రమోషన్లు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ తదితర సమస్యల వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు హనుమంతరెడ్డి, ప్రమీల, అర్జున్, సంజీవ్ కుమార్, రవికుమార్, రఘురామయ్య, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, మహమ్మద్ జిలాన్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతుడు చంద్రాయుడు

కనగానపల్లి: మండలంలోని ఎలకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ చంద్రాయుడు (60) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎంతో అభిమానమున్న చంద్రాయుడు.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక పోయాడు. ఈ క్రమంలోనే కౌటింగ్ రోజున భానుకోటలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో చిన్న కొడుకు ఆంజనేయులును పోలీసు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో మనోవేదనకు లోనైన ఆయన ఆరోగ్యం క్షీణించి శనివారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా ఆదివారం ఉదయం మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య రామాంజనమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అదే వేదన.. అవే కన్నీళ్లు

- కొన్ని రోజులుగా ఐసీయూలోనే చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి
- రూ.లక్షల ఖరీదుతో కూడిన వైద్యం
- చేతిలో చిల్లిగవ్వలేని నిరుపేద కుటుంబం


సాయం కోరుతున్న తల్లి శ్రీదేవి


బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రి ఐసీయూలో ఉన్న సాయిపవన్

బుక్కరాయసముద్రం: అదే వేదన... అవే కన్నీళ్లు... జబ్బు బారిన పడి చావుబతుకుల మధ్య జీవన పోరాటం. కన్నీళ్లు తుడిచి కాసింత భరోసానిచ్చే వారు లేరు. వైద్యం అందక పోతే పట్టించుకునేవారే లేరు. ప్రాణాంతక జబ్బు బారిన పడిన ఓ నిరుపేద బీటెక్ విద్యార్థి ఆస్పత్రి ఖర్చులు భరించే స్థోమత లేదని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని తల్లి అభ్యర్థిస్తోంది.

ఐదేళ్లుగా వెన్నాడుతున్న కష్టాలు..

బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన గంగాధర్, శ్రీదేవి దంపతులకు అజయ్‌వంశి, సాయిపవన్ అనే కుమారులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం గంగాధర్ నిమోనియా బారిన పడి మృతి చెందాడు. అప్పటి నుంచి శ్రీదేవిని కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. అనంతపురంలోని ఓ బేకరిలో కూలి పనులకు వెళుతూ కుమారులను చదివించుకోసాగింది. పెద్ద కుమారుడు అజయ్‌వంశి డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. చిన్న కుమారుడు సాయిపవన్ బీకేఎస్ మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ కళాశాలలో బీటెక్ – సీఎస్ఎం బ్రాంచ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

ప్రాణాలు కబళిస్తున్న జబ్బు..

కొన్ని రోజులుగా సాయిపవన్ నీరసంగా ఉండడంతో తల్లి శ్రీదేవి తల్లడిల్లిపోయింది. నగరంలోని పలు ఆస్పత్రుల్లో చూపించింది. శరీరంలో రక్త హీనత కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందంటూ వైద్యులు చికిత్స మొదలు పెట్టారు. అయినా ఫలితం దక్కలేదు. రోజురోజుకూ పరిస్థితి విషమిస్తుండడంతో చివరకు సర్వజనాస్పత్రికి పిలుచుకెళ్లింది. అక్కడి వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు.. బ్లడ్ క్యాన్సర్‌తో సాయిపవన్ బాధపడుతున్నట్లుగా నిర్ధారించారు. వెంటనే బోన్‌మ్యారో చికిత్స చేయాలని, లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని సూచించారు. అయితే చికిత్సకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఉన్న డబ్బు మొత్తం ఇప్పటికే వివిధ రూపాల్లో చికిత్స కోసం ఖర్చు పెట్టేసిన తాను అంత పెద్ద మొత్తాన్ని ఎక్కడి నుంచి తేవాలో అర్థం కాక తల్లి హృదయం విలవిలలాడిపోతోంది. ఇక తమకు దిక్కెవరు అంటూ మౌనంగా రోదిస్తోంది. దాతలు ఎవరైనా స్పందించి ముందుకు వచ్చి తనబిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని అర్థిస్తోంది. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తోంది.

సాయం చేయదలిస్తే...

బ్యాంక్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)
బ్రాంచ్ : కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం
ఖాతాదారు పేరు : ఎ.అజయ్‌వంశి
ఖాతా నంబర్: 3990 589 3511
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : SBIN0021644
ఫోన్ పే నంబర్ : 90523 39959

చూడచక్కని పల్లె అందాలు


బ్రిడ్జి కింద గూడు కట్టుకుంటున్న పక్షులు


పచ్చని పంట చేలలో గూడు కట్టుకున్న పక్షి

'పల్లెటూరమ్మో పల్లెటూరు మాది పాడి పంటలతో కళకళలాడే సల్లని ఊరు... గలగల పారే ఏరు మా పల్లెటూరులో చూడు... ఎంత చక్కని ఊరమ్మ చూడచక్కని పల్లె' అంటూ పల్లెటూరి అందాలు కనువిందు చేస్తున్నాయి. శింగనమల మండలం మిడ్‌పెన్నార్ డ్యామ్‌కు వెళ్లే మార్గంలోని ప్రతి పల్లె కొత్త అందాలను సంతరించుకుంది. డ్యాం వద్ద గిజిగాళ్ల గూళ్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. తేలిక పాటి గాలికే గంటల పాటు ఊగే గూళ్ల లోపల చిట్టి పక్షుల కిలకిల రావాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గార్లదిన్నె మండలం యర్రగుంట – కోటంక మార్గంలో రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు పచ్చటి తోరణాలతో స్వాగతిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


పచ్చటి తోరణం కింద నుంచి ప్రయాణిస్తున్న గ్రామీణులు


ఎర్రటి పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్న ప్రకృతి

డాక్టర్ సోమయాజులుపై దాడి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ సోమయాజులు

గుంతకల్లు: అద్దె విషయంగా చెలరేగిన వివాదంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీవీ సోమయాజులుపై కొందరు దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఆశ సూపర్ స్పెషల్ ఆస్పత్రి పేరుతో కొన్నేళ్లుగా ప్రైవేట్ ఆస్పత్రిని ఆయన నిర్వహించారు. కొంత కాలం క్రితం అక్కడ ఖాళీ చేసిన ఆయన గుంతకల్లులోని 60 అడుగుల రోడ్డులో ఆశ సర్జికల్ క్లినిక్ పేరున ఓ నర్సింగ్‌హోంను ఏర్పాటు చేశారు. అయితే అనంతపురంలో తాను ఖాళీ చేసిన భవనానికి సంబంధించి చివరి మూడు నెలల అద్దె కట్టకపోవడంతో కక్ష పెంచుకున్న యజమాని రామయ్య ఉద్దేశపూర్వకంగా తన మనుషులను పంపి ఆదివారం మధ్యాహ్నం క్లినిక్‌లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో తనపై దాడి చేయించారన్నారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు రెండో పట్టణ సీఐ గణేష్, రూరల్ ఎస్ఐ సురేష్ వెంటనే స్పందించారు. దాడికి పాల్పడిన రామయ్య అనుచరులను అదుపులోకి తీసుకుని వారి వాదనలూ విన్నారు. అనంతపురంలోని ఆస్పత్రి భవనాన్ని ఖాళీ చేసిన సోమయాజులు అందులోని ఫర్నీచర్ మొత్తం అలాగే వదలి వేయడంతో పాటు కొన్ని నెలల అద్దె బకాయిలు చెల్లించకుండా మొండికేశాడని వివరించారు. అనేక మార్లు అద్దె విషయంతో పాటు ఫర్నీచర్ తీసుకెళ్లాలని తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. దీంతో విసుగు చెందిన తాము ఆదివారం డాక్టర్ సోమయాజులుతో మాట్లాడేందుకు వస్తే రెచ్చగొట్టేలా మాట్లాడుతూ దౌర్జన్యం చేయబోయాడన్నారు. దీంతో పరస్పరం దాడి చేసుకున్నామన్నారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గణేష్ తెలిపారు.

భక్తి భావాన్ని పెంచిన సంగీతోత్సవం


సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: సినిమా పాటలకు, శాస్త్రీయ సంగీత కచేరీలకు భిన్నంగా భక్తి గీతాలతో సాగిన నిర్విరామ సంగీత కచేరీ అనంత వాసుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించింది. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి సౌజన్యంతో ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధి కసిరెడ్డి సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో ఆదివారం అనంతపురంలోని లలితకళాపరిషత్తు ఇందుకు వేదికైంది. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకూ వందలాది మంది గాయనీ గాయకులు భక్తి గీతాలతో అలరించారు. ఇందులో నగరానికి చెందిన 40 కళాబృందాలతో భక్తిపాటలు పాడి అలరించిన వంద మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు జరిగిన ఉద్ఘాటన కార్యక్రమానికి ఎల్కేపీ అధ్యక్షుడు గాజుల వెంకట సుబ్బయ్య, కార్యదర్శి పద్మజ ఆచార్య సుధాకరబాబు, అనంత ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు బాలమురళి, రెడ్డి జన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు సూర్యనారాయణరెడ్డి, సురేష్ మాట్లాడుతూ... సినిమా పాటలకన్నా భక్తిసంగీతమే అమరగాయకుడు ఘంటసాలను ఎంతో మందికి చేరువ చేసిందన్నారు. రంగస్థల సీనియర్ నటులు సోమిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామగోవిందు, వరప్రసాదు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

1న జీతాలు, పెన్షన్ల చెల్లింపు చట్టబద్ధం చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే 'తల్లికి వందనం' ఇవ్వాలి
- ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్


మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్ల చెల్లింపునకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా ఎన్‌టీఏ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీఓను రద్దు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చే వరకూ యాజమాన్యం వారీగా పదోన్నతులు కల్పించాలన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ జరగాలన్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా నేరుగా 12వ పీఆర్సీ అమలు చేయాలన్నారు. పెండింగ్ బకాయిలన్నీ వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే అమలు చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్ఎం పోస్టు ఉండాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయుడికి వారానికి 30 నుంచి 32 బోధనా పిరియడ్లు మాత్రమే ఉండేలా చూడాలన్నారు. ప్లస్–2 పాఠశాలలను ప్రజా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎం. వేణుగోపాల్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రేమనాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు శేషఫణి, నారాయణ నాయక్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బాలసుబ్రహ్మణ్యం, ఉమ్మడి జిల్లా నాయకులు పీవీ శ్రీనివాసులు, గోపాలప్ప, రామలింగయ్య, హనుమంతు, అక్కులప్ప, ఈరాలప్ప, ఖలందర్, అయ్యన్న, వెంకటరమణ, రాంభూపాల్ రెడ్డి, రాఘవేంద్ర, ముస్తాక్ అహమ్మద్, ఇర్షాద్ అహమ్మద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక కార్యకర్త మృతి

- ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు రోజులకే తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిక
- చికిత్సకు స్పందించక కర్నూలు ఆస్పత్రిలో మృతి


రాజేందర్ (ఫైల్)

కొత్తచెరువు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఓ కార్యకర్త అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. వివరాలు... కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ ఎర్రబల్లి గ్రామానికి చెందిన వడ్డె రాజేందర్ (42) వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ వచ్చాడు. ఈ నెల 4 ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక తీవ్ర మనస్తాపం చెందాడు. గ్రామంలో ఎవరిని అడిగిన ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశామని చెబుతున్నారని, అయినా పార్టీ ఓడిపోవడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందని పలువురితో చెప్పుకుని బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు తర్వాత బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజుల తర్వాత కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కర్నూలులోనే చికిత్స పొందుతున్న ఆయన... పరిస్థితి విషమించడంతో ఆదివారం వేకువజాము 2 గంటలకు మృతి చెందాడు. బేల్దారి పనులతో జీవనం సాగించిన రాజేందర్‌కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTO MOBILE

AUTOMOBILES

■ జయలక్ష్మి మారుతి సుజికి కార్ షోరూమ్ సార్/మేడమ్, మీకు కావాల్సిన మారుతి సుజికి కార్స్ అన్ని మోడల్స్ మా వద్ద లభించును. ఫైనాన్స్ సౌకర్యం కలదు, హోమ్ డెలివరీ కూడా చేయబడును. వివరాలకు సంప్రదించండి: 9154255330. [A-1256]

EDUCATION

B.Pharmacy ADMISSIONS

■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Pharmacy నందు ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్, క్వాలిఫై కానివారికి Only హాస్టల్ ఫీజు, సంప్ర: జి. మురళి, 9030661651, అనంతపురం. [A-1249]

DMLT ADMISSIONS

■ DMLT 2 సం॥ల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. మా కాలేజ్ నందు స్టేట్ ర్యాంకులు 1st & 6th to 14th వరకు. # SEEDS కాలేజ్ కమలానగర్, ATP. 9440255034. [A-1253]

B.TECH అడ్మిషన్స్

■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Tech (Any Branch) లో ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. AP EAPCET క్వాలిఫై కానివారికి,ఎంట్రన్స్ రాయని స్టూడెంట్స్ Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. కాలేజీ ఫీజు ఉండదు. సంప్ర: జి. మురళి 9030661651, అనంతపురం. [A-1251]

REAL ESTATE

HOUSE FOR SALE

■ అనంతపురం జిల్లా, పెద్దవడుగూరు మండలంలోని కోటలో 100% వాస్తుతో నిర్మించిన, ఉత్తరం, దక్షిణం కార్నర్ ఇల్లు 2 సెంట్లలో నిర్మించినది అమ్మబడును. ఫోన్: 90529 59380. [L-800678]

FOR RENT / LEASE

■ అనంతపురం, సాయినగర్, 6వ క్రాస్, మసీద్ సర్కిల్ దగ్గర, SLV హాస్టల్–3 ఫ్లోర్స్ బిల్డింగ్ అన్ని వసతులతో క్లీనిక్స్/ ఇనిస్టిట్యూట్స్/ ఆఫీస్‌లకు రెంట్ / లీజ్‌కు కలదు. సెల్:9440448710, 9440287215. [A-169]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V- 6508]

WANTED

■ ATP, ఓల్డ్ టౌన్, వాటర్ బాటిల్స్ డెలివరీ Boys కావలెను. 3వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారు, జీతం: 12–20K + ఫుడ్ & అకామడేషన్: 9985960006. [A-1258]

■ ప్రముఖ GNR TRADERS నందు పనిచేయుటకు ఆటో డ్రైవర్స్ కావలెను.జీతం: 12,000 అనంతపురం లోకల్ వారికి మాత్రమే, Contact: 8143066551. [A-1252]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోమ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15–25 వేలు, మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 79934 59404. [M-1185224]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185222]

■ చెదల నివారణ సంస్థలో పని చేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను, వెహికల్ తప్పనిసరి, జీతం: రూ. 15,000/-, అర్హత: 10th, సంప్ర: ✆ 78425 41979, 94945 69895. [B-178]

■ వెంటనే కావలెను బెంగుళూరు ప్రొడక్షన్ వర్క్‌లో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ప్యాకింగ్ స్కానింగ్ ఆఫీస్ & సిస్టం వర్క్ జీ. 16K-18K ESI+PF+ఫుడ్+ రూమ్. ఫోన్:7349043262 / 9741121160 [HA-280]

■ ప్రముఖ వాటర్ బాటిల్స్ కంపెనీకి, మార్కెటింగ్ చేయుటకు సేల్స్‌మెన్ కావలెను. Q: 10th, ఆపైన, వయస్సు : 22–35 ఇంటర్వ్యూ: జూన్ 26. సెల్ : 9000223306. [A-1254]

■ S.V. చికెన్ సెంటర్ అనంతపురం నందు పనిచేయుటకు 10th / Inter చదివిన వర్కర్ కావలెను. సెల్ : 80744 29294, 95420 93517. [A-168]

■ Wanted Required Teachers and Lecturers to Teach the Classes From 6 to 12 at Karnataka and Tamilnadu. Contact : 8019855845. [A-7007]

■ అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ ఆఫీసులో టెలికాలర్స్‌గా వర్క్ చేయడానికి ఫిమేల్స్ కావలెను. సెల్: 8977502169. [A-3236]

■ Wanted Qualified Teachers to Teach English Medium in Higher School for the Following Subjects Maths, Telugu , Hindi & Sciences @ Little Flower E.M.School. ATP. Ph: 9949083624 [HA-286]

■ (1) Cold storage plant Operators (ITI- Electrical, Exp- 2 Yrs), (2) Fruits & Vegetables - Assistant Procurement Incharge @Fresh cart Agro (p)ltd, Kld road,Atp (interview: June 24), Cell: 8143697965,9346612228. [A-167]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లోకాలు ఏలేవాడు.. కొండపై వెలిశాడు చూడు

- భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న కొండమీదరాయుడు
- ఆపదలు తీర్చే ఆపద్బాంధవుడిగా ఘనకీర్తి


కొండపై స్వామివారి మూలవిరాట్


కొండపై వెలసిన కోదండరాయుని దేవాలయం

చూసొద్దాం

బుక్కరాయసముద్రం: లోకాలు ఏలే దైవంగా ఖ్యాతిగాంచిన ఆ శ్రీమన్నారాయణుడే స్వయంభు గా జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని దేవర కొండపై వెలిశాడు. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్నాడు. ఆపదలో ఉన్న వారికి తోడునీడగా నిలిచి ఆపద్బాంధవుడిగా భక్తులతో కీర్తింపబడుతున్నాడు. జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రాల్లో దేవరకొండ ఒకటి. కలియుగ ప్రత్యక్ష దైవంగా కీర్తింపబడుతున్న సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరుడే ఇక్కడ వెలసినట్లుగా స్థల పురాణం చెబుతోంది.

ఆలయ చరిత్ర...

జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం కొండపై వెలసిన కొండమీదరాయుడు స్వామి ఆలయం భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతోంది. ఎత్తైన కొండపైన వెలసిన ఈ ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి ఉద్భవమూర్తిగా ఆలయ చరిత్ర చెబుతోంది. పూర్వం గార్గేయ మహర్షి ఈ కొండపై తపస్సు చేసే సమయంలో సాక్షాత్తూ వేంకటేశ్వర స్వామి ఇక్కడ ఉద్భవించారని లోకోక్తి. ఈ ఆలయాన్ని సందర్శిస్తే తిరుమల క్షేత్రాన్ని సందర్శించినంత పుణ్యఫలం దక్కుతుందని వేద పండితులు అంటున్నారు. ఆలయ నిర్మాణం మొత్తం తిరుమలలోని ఆనంద నిలయాన్ని పోలి ఉండడం గమనార్హం. అతి ఎత్తైన కొండపైకి సులువుగా చేరుకోవడానికి రహదారిని కూడా నిర్మించారు. తిరుమలలో జరిగినట్లే ఇక్కడ కూడా నిత్యం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుగుతుంటాయి.

ఆది శేషుడే రక్షగా...

దేవరకొండపై వెలిసిన ఉద్భవమూర్తి కొండ మీద రాయుడు మూలవిరాట్ వెనుక వైపు వైపున ఓ గుహ ఉంది. ఈ గుహ ప్రవేశ ద్వారం మొదట చిన్నగా ఉంటూ పోనుపోను విశాలంగా ఉంటుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ గుహలోనే ఓ కోనేరు ఉందని, ఆ కోనేరు వద్ద ఓ దేవతా సర్పం సంచరిస్తూ స్వామి వారికి నిరంతర రక్షణగా నిలుస్తోందని, ఈ కోనేరు మీదుగా గుత్తి కోటకు, పెనుకొండ కోటకు రహస్య మార్గాలు ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. పూర్వం రాజుల కాలంలో ఈ రహస్య మార్గాలను ఉపయోగించేవారని తెలిపారు. ఇక్కడ నిత్యపూజలతో పాటు ప్రతి శనివారమూ ప్రత్యేకమైన అలంకరణతో స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. భక్తుల సౌకర్యార్థం భవనాలు, ఇతర మౌలిక వసతులూ కల్పించారు.


వాహనాలు వెళ్లే సిమెంట్ రోడ్డు మార్గం

మాఘమాసం ప్రత్యేకం

కోరుకున్నవారికి కోరినన్ని వరాలను ఇచ్చే కోటివరాలదేవుడుగా భక్తులతో కీర్తింపబడుతున్న కొండమీదరాయుడు స్వామిని మాఘ మాసంలో దర్శించుకుంటే ఎలాంటి ఇబ్బందులైనా దూరమవుతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో అనాదిగా ప్రతి ఏటా మాఘ మాసంలో బుక్కరాయసముద్రంలో కొండమీదరాయ స్వామి తిరునాల, బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. కొండ పైకి వెళ్లేందుకు మెట్ల మార్గంతో పాటు వాహనాల కోసం ప్రత్యేకంగా సిమెంట్ రోడ్డునూ ఏర్పాటు చేశారు. కొండ చుట్టూ గిరి ప్రదక్షణకు ప్రత్యేక రోడ్డు మార్గమూ ఉంది. కొండ కింద క్షేత్ర పాలకుడిగా ఆంజనేయ స్వామి పూజలు అందుకుంటున్నాడు. ఈ ఆలయానికి చేరుకోవాలంటూ అనంతపురంలోని పాతూరు తాడిపత్రి బస్టాండ్ నుంచి ప్రతి అర గంటకు ఓ ఆటో బయలుదేరుతూ ఉంటుంది. అలాగే బుక్కరాయసముద్రం గ్రామంలో బస్సు దిగి ఆటోలు లేదా సొంత వాహనాల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు.

క్లుప్తంగా

కవి పరిశీలనా దృష్టి మారుతుండాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

అనంతపురం కల్చరల్: సమాజంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలకు అనుగుణంగా కవి తన పరిశీలనా దృష్టిని మార్చుకున్నప్పుడే సమాజహితమైన సాహిత్యం ఆవిర్భవిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో సీనియర్ కవి మధురశ్రీ రచించిన ‘శ్వాసతో యుద్ధం’ కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బండి నారాయణ స్వామి, ప్రముఖ రచయిత శ్రీనివాస గౌడ్, పుస్తక సమీక్షకులు డాక్టర్ అంకె శ్రీనివాస్, ఉప్పరపాటి వెంకటేశులు, చిత్రకళా రచయిత ఎల్ఆర్ వెంకటరమణ, జిరసం కార్యదర్శి కొత్తపల్లి సురేష్ హాజరై మాట్లాడారు. మధురశ్రీ కవిత్వం కాలానికి నిలబడే కవిత్వమన్నారు. చాలా మంది స్పృశించని అంశాలను అలవోకగా పాఠకులకు అర్థమయ్యేలా చెప్పడం అతనికే చెల్లిందన్నారు. కవి నిజాయితీ రచనల్లోనూ దాగుండటం మధురశ్రీ కవితల్లో చూడొచ్చని వక్తలు కొనియాడారు. అంతకు ముందు ఉద్దీనగీతంతో గోసల నారాయణ స్వామి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా, కవులు నబీరసూల్, వన్నప్ప, విశాలాంధ్ర ఈశ్వరరెడ్డి, టీవీ రెడ్డి, ఈరన్న, నాగేంద్ర, రియాజుద్దీన్, చం.శాస్త్రి, కృష్ణమూర్తి, సంజీవిని రమణారెడ్డి, మిద్దె మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్కిన్ మృతి తీరని లోటు


ముస్కిన్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: సీపీఎం నాయకుడు, అవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. ముస్కిన్ వ్యాపారీత్యా ఆదివారం ఉదయం నగరంలోని మార్కెట్ యార్డుకు వెళ్లారు. అక్కడ ఆయన గుండెపోటుకు గురై మరణించారు. సీపీఎం నాయకులు సోములదొడ్డిలోని ముస్కిన్ స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్కిన్ ఎన్నో ప్రజాఉద్యమాలను నడిపారన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఆర్‌సీ, సీఏఏ చట్టాలకు వ్యతిరేకంగా మైనారిటీలందరినీ ఐక్యం చేసి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నల్లప్ప, బాలరంగయ్య, శ్రీనివాసులు, రామిరెడ్డి, ప్రకాశ్, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, సీపీఐ నాయకులు జాఫర్, శ్రీరాములు, లింగమయ్య, ముస్లిం మైనారిటీ నాయకులు నదీమ్, మునాఫ్, రాజాక్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


గోవిందరాజులు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల పంచాయతీ హరియాన్ చెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న హెచ్ఎం గోవిందరాజులు గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోవిందరాజులు దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలు రద్దు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయన్నారు. విద్యార్థులు నష్టపోకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలు సక్రమంగా నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి, వాసు, శర్మాస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పాడితో బతుకు పంట

- ఆత్మకూరుకు చెందిన సురేష్ మూడు ఆవులను కొనుగోలు చేశాడు. తనకు ఉన్న ఒక ఎకరా పొలంలో పచ్చగడ్డి సాగు చేశాడు. ఆ మూడు ఆవులు రోజుకు ఉదయం, సాయంత్రం 30 లీటర్ల పాలకు పైగానే ఇస్తాయి. ఒక లీటరు రూ.32 ధరతో విక్రయిస్తే ఆ రైతుకు నెలకు దాదాపు 29 వేల వరకూ ఆదాయం వస్తోంది. ఇందులో రూ.6 వేలు పశువుల దాణా, గడ్డి సాగుకు, ఇతర ఖర్చులకు పోగా.. నెలకు దాదాపు రూ.18 వేలకు పైగా మిగులుతోంది. దీంతో ఆ రైతు పిల్లల్ని చదివిస్తూ తన కుటుంబాన్ని సంతోషంగా చూసుకుంటున్నాడు.
- ఆత్మకూరుకు చెందిన నారాయణ బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పని కోసం రోజు అనంతపురం వెళ్లేవాడు. వచ్చే కూలిలో ఖర్చులు పోనూ మిగిలిన ఆదాయంతో కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఉదయం వెళ్లి సాయంత్రం పొద్దు మునిగాక ఇంటికి వచ్చేవాడు. వచ్చే అరకొర ఆదాయంతో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం నారాయణ తన భార్య బ్యాంక్ నుంచి తీసుకున్న రుణంతో ఆవులను కొనుగోలు చేశాడు. ఉదయం, సాయంత్రం ఆవులను చూసుకుంటూ పాలు డెయిరీకి పోస్తున్నాడు. వచ్చే ఆదాయాన్ని కుటుంబ పోషణకు వెచ్చిస్తున్నాడు.


యాలేరు వద్ద సాగు చేసిన పచ్చి గడ్డి

- పాడిని నమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న రైతులు
- సొంత గ్రామాల్లోనే ఉపాధి
- పెరుగుతున్న పాల ఉత్పత్తి


పాలు పితుకుతున్న రైతు

ఆత్మకూరు: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాడిని నమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గతంలో చాలా మంది ఏం పని చెయ్యాలో దిక్కు తోచక గ్రామాల నుంచి పట్టణాలకు వలస వెళ్లేవారు. రోజు కూలి పనులకు వెళ్లి వచ్చేవారు. బేల్దారి పని మొదలుకుని ప్లంబింగ్ లేదా ఇతర ఏ కూలి పని అయినా చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వారు. వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ భారంగా మారేది. దీంతో సొంత గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటున్నారు. చాలా మంది తమకు భూమి లేకపోయినా సరే వేరొకరి భూమిలో ఏడాదికి ఎకరాకు కొంత నగదును మాట్లాడుకుని పచ్చగడ్డిని సాగు చేస్తున్నారు. మరి కొంత మంది ఆవులను కొనుగోలు చేసి, దాణా, అన్నం, వరిగడ్డి వేస్తూ పాడిని వృత్తిగా ఎంచుకుంటున్నారు. మండల వ్యాప్తంగా చూసేకుంటే దాదాపు 11 వేల వరకు ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటిలో 7 వేలకు పైగా ఆవులే ఉండగా.. 4 వేల వరకు గేదెలు ఉన్నాయి. ఒక రోజుకు మండల వ్యాప్తంగా దాదాపు 9 వేల లీటర్లు పాలను మండలం నుంచి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు.

పశువుల పెంపకంపై ఆసక్తి..

మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం పశువుల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. పాలు ఇచ్చే ఆవును బట్టి ఒక్కో ఆవు రూ.50 వేల నుంచి లక్షకు పైగా ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ఇంట్లో మూడు నుంచి ఐదు ఆవులు పైనే ఉంటున్నాయి. గేదెలతో పోల్చుకుంటే ఆవులు పాలు ఎక్కువగా ఇస్తాయి. దీంతో చాలా మంది సామాన్య ప్రజలు తమ కుటుంబ పోషణకు ఎక్కువగా ఆవులను కొనుగోలు చేస్తున్నారు. గేదెలు అయిదే ఉదయం, సాయంత్రం కలిపినా 7 లీటర్ల కన్నా ఎక్కువ పాలు ఇవ్వలేవు. అదే ఒక ఆవు ఉదయం, సాయంత్రం కలిపి దాదాపు 15 లీటర్ల వరకు పాలు ఇస్తాయి. ఆవులు పచ్చి గడ్డి ఎక్కువగా తినడం వల్ల దాణా ఖర్చు కూడా ఎక్కువగా ఉండదని పాడి రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా పాల ధరలు..

ప్రస్తుతం ఏమి లేని వారు కూడా అప్పులు చేసి మరీ ఆవులను కొనుగోలు చేసి పాడి ద్వారా కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఆవు, గేదె పాలకు సంబంధించి ఫ్లాట్‌ను బట్టి పాల ధర నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఆవు పాలు ఒక లీటరుకు రూ.32 నుంచి రూ.34 వరకూ పాడి రైతులకు అందుతోంది. అదే విధంగా గేదె పాలకు సంబంధించి ఒక లీటరు రూ.40 నుంచి రూ.50 వరకు ధర వస్తోంది. చాలా మంది సామాన్య ప్రజలు పాల ఉత్పత్తి పైనే ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నారు. మండలంలో వెలుగు సంఘం ద్వారా దాదాపు 58 మందికి బ్యాంకు నుంచి రుణాలు కూడా అందించారు. పాడి పరిశ్రమకు సంబంధించి పీఎమ్ఈజీపీ పథకం కింద ఆవులను కొనుగోలు చేయడానికి బ్యాంకు వారు వైకేపీ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందించారు. ఈ రుణాలకు బ్యాంకు నిబంధనల ప్రకారం వడ్డీ ఉంటుంది. పీఎమ్ఈజీపీ పథకం కింద రుణాలు తీసుకున్న లబ్ధిదారులు అప్పు మొత్తం చెల్లించాక సబ్సిడీ కూడా వర్తిస్తుందని ఏపీఎం మదన్‌మోహన్ తెలియజేశారు.


ఆవులను నీటితో శుభ్రం చేస్తున్న యువకుడు


ఆత్మకూరులో మేత మేస్తున్న పశువులు

కల్యాణోత్సవ వేడుకలకు శ్రీకారం

అనంతపురం కల్చరల్: ఏటా అంగరంగ వైభవంగా సాగే పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవానికి మరోసారి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటూ ఆధ్యాత్మిక సందడిని రేపే ఉత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. స్థానిక అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయంలో ఉదయం మహాగణపతి, నవగ్రహ సమేత పందిరి పూజలు, ప్రధాన కలశస్థాపన, ఉత్సవ మూర్తులకు రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గురుమూర్తి స్వామి మాట్లాడుతూ.. సోమవారం ఉదయం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరుగుతుందన్నారు. గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. భక్తులకు అనుగ్రహ భాషణం కూడా చేస్తారన్నారు. సాయంత్రం నగరవీధుల్లో స్వామిని ఊరేగించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవంలో వేర్వేరు ప్రాంతాల నుంచి విచ్చేసే కళాకారులు శివకళారూపాలను ప్రదర్శిస్తారన్నారు. భక్తులు స్వామి కల్యాణంలో పాల్గొనాలని కోరారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.


మహాశివుడికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకుడు గురుమూర్తి స్వామి

వైఎస్ జగన్‌తో విద్యార్థి విభాగం నాయకుల భేటీ



వైఎస్ జగన్‌తో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పి.హేమంత్ కుమార్, కురుబ వాసు

అనంతపురం: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పి.హేమంత్, కురుబ వాసు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం పులివెందుల పర్యటనలో ఉన్న జగన్‌ను కలిసి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. టీడీపీ నాయకులకు భయపడి వర్సిటీలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఉన్నతాధికారులు తొలగించారని తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని.. విద్యార్థులకు తోడుగా ఉండాలని వైఎస్ జగన్ సూచించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోతలయ్య ఆదివారం ద్విచక్రవాహనంలో పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్కెట్‌యార్డు సమీపంలో బత్తలపల్లి వైపు వెళ్లే కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పోతలయ్య కాలు విరిగిపోయి చేతులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన పోతలయ్య

ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

బెళుగుప్ప: మండల కేంద్రం బెళుగుప్పలోని శాంతి ధామంలో ఆదివారం సద్గురువు అవధూత ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎర్రితాతస్వామి 88వ ఆరాధనోత్సవాల్లో భాగంగా కలశపూజ, గణపతి, నాందీ పూజలతో వేదపండితులు ప్రారంభించారు. ఆధ్యాత్మికతను బోధిస్తూ, బెళుగుప్పలో ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం అవధూత ఎర్రితాత జీవ సమాధి అయ్యారు. దీంతో భక్తులు ఎర్రితాత సమాధిని గంగపూజతో శుద్ధిచేసి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఎర్రితాత సమాధికి మహా క్షీరాభిషేకం, బిల్వార్చన, పల్లకీసేవ, పాదుకాభిషేకం, శేషతల్ప అలంకరణలు, రాత్రికి పురవీధులగుండా స్వామివారి ప్రభోత్సవం, మంగళవారం చత్రప్రభ అలంకరణ, ఉట్లపరుష, కోలాటం ఉంటాయన్నారు.


అలంకరణలో దర్శనమిస్తున్న ఎర్రితాత స్వామి

రామానాయక్ సేవలు అమూల్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో 41 సంవత్సరాల సర్వీస్‌లో ఓవైపు ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా అనేక మంది టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ.. మరోవైపు సేవా కార్యక్రమాలు చేపట్టిన ఎస్.రామానాయక్ అందరివాడుగా పేరు తెచ్చుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు, ఎస్‌వీఆర్ (నార్త్) మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామానాయక్ ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వేలాది మంది విద్యార్థులకు బోధించి జిల్లాలో టీచర్ సంఘం నాయకుడిగా అనేక సేవలందించారన్నారు. ఉపాధ్యాయ వృత్తికే రామానాయక్ వన్నె తెచ్చారని గుర్తు చేశారు. తన విధులపై అంకితభావంతో ఉండేవాడన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా డెగావత్ రవీంద్రనాయక్ టీచర్‌గా విద్యార్థులకు చదువు చెబుతూనే, ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా అందరి మన్ననలు పొందారని తెలిపారు. అనంతరరం రామానాయక్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, ఆలిండియా బంజారా సేవాసమితి అధ్యక్షుడు చక్రేనాయక్, ఏపీటీఎఫ్ (1938) నాయకులు కులశేఖర్ రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ పి.అశోక్‌కుమార్‌రెడ్డి, కె.ఓబుళపతి, పీఎస్‌హెచ్ఎం లక్ష్మీనారాయణ, బీటీఏ ఓబులేసు, ఆర్ఈఎఫ్ రామచంద్ర, నారాయణ నాయక్, ఎనజీఓ అసోసియేషన్ మనోహర్‌రెడ్డి, పీఆర్‌టీయూ పురుషోత్తమ రెడ్డి, ఎస్సీ.ఎస్టీ ఎంఈఓల అసోసియేషన్ గురుప్రసాద్, చంద్రనాయక్, గోపాల్‌నాయక్, ఎంఈఓ వాణీదేవి, ఆర్‌యూపీపీ ఎర్రిస్వామి, తులశిరెడ్డి, ఎస్ఎల్‌టీఏ ఆదిశేషు, శివానందరెడ్డి, ఆపస్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.


రామానాయక్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పంపనూరులో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


పూజలందుకున్న మంజునాథుడు


ప్రత్యేక అలంకరణలో పార్వతీ దేవి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరుడి మూలవిరాట్‌కు మాఘ స్నానాలు, ఆకుపూజ అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్ప నివారణ రాహుకేతు హోమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామికి రుద్రాభిషేకం, పార్వతీ దేవికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం

బత్తలపల్లి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ మధు ఆచారీ, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద అన్నారు. ఆర్డీటీ క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా ఫౌండర్ విన్సెంట్ ఫెర్రర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విన్సెంట్, మాంచో, విశాల్, అన్నే జట్లు మధ్య లీగ్‌లు జరగ్గా విన్సెంట్, మాంచో జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం మాంచో టీం, విన్సెంట్ టీం జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఆర్డీ ప్రమీల టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విన్సెంట్ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. అనంతరం 173 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన మాంచో జట్టు 23.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ జయరామ్‌కు దక్కింది. విజేతకు, రన్నర్ జట్లుకు బహుమతులను అందించారు. ఈ టోర్నమెంట్‌కు సహకారం అందించిన నడిమింటి షేక్షావలి, క్రీడాకారులకు దుస్తులను అందించిన పామాల రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ జయరాం, ఆర్గనైజర్లు శంకర్‌దవాన్, చందు, ఇర్ఫాన్, అప్పస్వామి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

‘రెడ్డి వివాహ పరిచయ కార్యక్రమం’ నిర్వహణకు చర్యలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పాపంపేటలోని కార్యాలయంలో ఆదివారం రాయలసీమ రెడ్డి జన సంఘం కమిటీ సమావేశం జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం రెడ్డి వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహించేలా తీర్మానించారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి కులస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రొద్దం సురేష్‌రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, ముచ్చుకోట నారాయణ రెడ్డి, కల్లూరు నాగరత్నం రెడ్డి, కర్నూలు రమణారెడ్డి. దయానంద రెడ్డి, రేనాటి శివానందరెడ్డి, గొట్లూరు శ్రీనాథ్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, కేవీ శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబిరెడ్డి, వాసుదేవ రెడి, పోతిరెడ్డి, కుమ్మెత రాజగోపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రేనాటి వెంకటరామిరెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

‘రేపటి మైదానం’ కృతి స్వీకర్తగా రాచపాలెం

అనంతపురం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర రెడ్డికి మరో గౌరవం దక్కింది. ప్రఖ్యాత కవి డాక్టర్ ఎన్.గోపి రచించిన రేపటి మైదానం కావ్యం కృతి స్వీకర్తగా ఆచార్య రాచపాలెంను ఎంపిక చేశారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వారి ఆధ్వర్యంలో ఆచార్య గోపి అమృతోత్సవ వేడుకలు ఈనెల 25న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే ప్రఖ్యాత కవులు, రచయితలతో సాగే వేడుకల్లో రాచపాలెం చంద్రశేఖరరెడ్డి 75 కవితల సంపుటి కృతి స్వీకర్తగా వ్యవహరిస్తారని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ ప్రభాకరరావు, కార్యదర్శి మద్దాళి రఘురామ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సందడి


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని గుడ్‌షెపర్డ్ పాఠశాలలో 1996 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను, తరగతి గదిలో జరిగిన సంఘటలను గుర్తు చేసుకున్నారు. వీరికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. చాలా ఏళ్ల తర్వాత గురువులతో కలిసి మాట్లాడుకునే అవకాశం రావడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్యాముల్, వంశీ, రూప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాటి ఉపాధ్యాయులు చెప్పిన చదువులతోనే ఈరోజు ఒక్కొక్కరు ఒక్కో రంగంలో స్థిరపడ్డామన్నారు.

కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందిస్తున్నామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గూడూరు మోహన్‌దాస్, కార్యదర్శి రాజగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరం దాతలుగా కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం కుమారుడు కాచర్ల నాగరాజు వ్యవహరించారు. శిబిరంలో 85 మందికి కంటిపరీక్షలను చేయగా 50 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ కోశాధికారి వేణుగోపాలాచార్యులు, సభ్యులు మెటికల కుళ్లాయప్ప, శాగా సురేష్, రాధాకృష్ణ, ఉట్టి శివప్రసాద్, కొత్తపాలెం కుమార్, చందా నాగరాజు, రమేష్‌బాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లారీ దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన లారీ

విడపనకల్లు: మండల పరిధిలోని 67వ జాతీయ రహదారిలో హంచనహాల్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున గుంతకల్లు నుంచి బళ్లారి వైపు వెళ్తున్న లారీ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఒక్కసారిగా లారీలో నుంచి మంటలు చెలరేగాయి. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. అప్పటికే లారీ ఎనభై శాతం కాలిపోయింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727